మినీకథ

# రాగింగ్

కాలేజి క్యాంపస్ అంతా కోలాహలంగా ఉంది. అందరూ ఎవరి గొడవల్లో వాళ్ళు ఉన్నారు. కొందరు మగవాళ్ళు గ్యాంగ్‌లా ఒక దగ్గర చేరి లేడీస్‌ను టీజ్ చేస్తున్నారు.

"ఒరేయ్, కొత్త పిట్టరా, ముత్తానికి భలే గుంది" అటువైపు వస్తున్న అమ్మాయిని చూపిస్తూ అన్నాడొకడు అందులో నుంచి. వాళ్ళు ఆ అమ్మాయిని వదల దలచుకోలేదు. ఉక్కుమ్మడిగా ఆమె చుట్టూ చేరారు. అంత మంది మగవాళ్ళు ఒక్కసారిగా చుట్టుముట్టేసరికి లేడి పిల్లలా గజగజ వణికిపోయింది ఆ అమ్మాయి.

"ఆహా, ఏమి నీ అందం. క్షేత్రయ్య పాడని జావళివా, అన్నమయ్య రచించని కీర్తనవా, పదాలకందని సంకీర్తనవా" అన్నాడు ఆ గ్యాంగ్‌కు లీడరయిన అనిల్.

"ఇంతకీ నీ పేరు"

"అ... అ...నిత" భయంతో తడబడుతూ చెప్పింది ఆ అమ్మాయి. "హా నైస్ నేమ్, నా పేర్లు అనిల్. మనిద్దరి పేర్లు దాదాపు ఒకటయ్యాయి. మరి మనిద్దరం కూడా ఒకటయిపోదామా" అన్నాడు అనిల్.

స్త్రీ సహజ శరీరంలోని రక్తమంతా మొఖంలోకి చేరి ఎర్రగా కందగడ్డలాగయింది అనిత మొహం. కోపంతో, అవమానంతో కంపించిపోయింది ఆమె.

"ఇది అన్యాయంరా. పిట్ట బాగుందని ఎగరేసుకుపోదామనుకుంటున్నావా. నీతో పాటు మేము నలుగురం ఉన్నాము. ఆ విషయం మర్చిపోకు" అన్నాడొకడు అందులో నుంచి.

"అందర్నీ చేసుకుంటానంటే నాకేం అభ్యంతరం లేదురా. ఏం బేబి మా అయిదుగుర్ని చేసుకుంటావా. కలియుగ పాంచాలిగా పేరు తెచ్చుకుందువు గాని" అన్నాడు అనిల్.

"................"

"మౌనం అర్ధాంగీకార సూచకమనుకోవాలా .... అంగీకార సూచకమనుకోవాలా" మళ్ళీ అన్నాడు అనిల్.

"ప్లీజ్. నన్ను వెళ్ళనివ్వండి" వచ్చే కన్నీటిని ఆపుకుంటూ అంది అనిత.

"అమ్మమ్మా, ఆశ. అపుడే వదుల్తామనుకున్నావా. ఇంతకీ ఈ చైన్ గోల్డ్ నీదేనా". ఆమె గుండెల మీద ఉన్న చైన్‌ను చేత్తో పట్టుకున్నాడు అనిల్.

చటుక్కున గొలుసును వెనక్కి లాగేసుకుంది అనిత. అంత దుఃఖంలోను కోపంగా చూసింది అనిల్ వైపు.

"నీ గుండెల్ని తాకానా: నీ బాడీని తాకానా? ఎందుకంత కోపంగా చూస్తున్నావు" అనిల్.

"అది కోపం కాదురా. సిగ్గు ఆ మాత్రం తెలీదు" ఎవడో అన్నాడు.

"అవున్రోయ్ మరిచేపోయాను. స్త్రీకి సిగ్గే సింగారం అన్నాడు ఎవడో కవి. ఇంత సింగారం ఎవరి కోసం దాచి పెట్టిందో! ఎవరో ఆ అదృష్టవంతుడు" నిట్టూరుస్తూ అన్నాడు అనిల్.

"డాన్స్ వచ్చా నీకు"

"రా... రాదు"

"అయితే నువ్వు డాన్స్ చేసి తీరాల్సిందే. ఏదీ చెయ్యమ్మ ఒకసారి. థాయ్ తథై... తధుంగినతా"

"దయచేసి నన్ను వదిలిపెట్టండి" ఏడుస్తూ వేడుకుంది అనిత.



అనిల్ ఇంకా ఏమో అనబోయాడు కాని తన గర్ల్‌ఫ్రెండ్ అటువైపు రావడంతో నెమ్మదిగా జారుకున్నాడు. అతనితో పాటు అతని ఫ్రెండ్స్ కూడా వెళ్ళిపోయారు.

అవమాన భారంతో కందిన మొహంతో గిరుక్కున వెనుతిరిగి చరచరా వెళ్ళిపోయింది అనిత.

"అమ్మా, చెల్లాయి వచ్చిందా" గట్టిగా అరుస్తూ ఇంట్లోకి వచ్చాడు అనిల్.

"నువ్వు అలా కాలేజికి వెళ్ళావో లేదో, ఇలా బాబాయ్ తీసుకొచ్చాడురా చెల్లెను. మంచి రోజు కదా అలా చూసి రమ్మని కాలేజీకి పంపించాను. నీ కాలేజీగా, కనిపించలేదా. అయినా ఎపుడో చిన్నపుడు చూశావు గుర్తుపట్టి వుండవులే" అంది అనిల్ తల్లి లక్ష్మి.

అనిల్‌కు తన బాబాయ్ కూతురంటే ప్రాణం. సొంత చెల్లెలు లేకపోవడంతో బాబాయ్ కూతుర్ని ఎంతో ఇష్టపడేవాడు. ఆ తరువాత తన బాబాయ్‌కి ట్రాన్స్‌ఫర్ అయి ఎక్కడో మారుమూల ప్రాంతానికి వెళ్ళి పోయారు. మళ్ళీ ఇంతవరకు తారసపడలేదు.

ఇన్నాళ్ళకు మళ్ళీ కలుసుకోవడం. తన చెల్లెలు వారి ఊర్లో కాలేజీ లేక ఈ ఊరి కాలేజీలో జాయిన్ అయిందని హాస్టల్లో కాకుండా తమ ఇంట్లోనే ఉంటుందని తల్లి ద్వారా తెలిసి ఎంతో సంతోషించాడు అనిల్.

"ఎలావుందో చెల్లి, ఏడేండ్లపుడు చూశాను. ఇపుడు పెద్దది అయి ఉంటుంది. అవును మరి నేనూ పెద్దాడ్ని కాలేదూ. చెవి మెలిపెట్టి ఆట పట్టించి ఏడిపించాలి చెల్లెను" అని ఆలోచిస్తున్నాడు అనిల్.

"ఒసే అనూ, మీ అన్నయ్య వచ్చాడు. చూద్దువు గానిరా" అని అరిచింది లక్ష్మి.

తన చిన్నారి చెల్లెలి కోసం ఆతృతగా ఎదురు చూసిన అనిల్ "ఎక్కడ పెద్దమ్మా అన్నయ్య" అంటూ వచ్చిన అమ్మాయిని చూసి పక్కన బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు అనిల్.

తను కాలేజీలో రాగింగ్ చేసిన అనిత తన చెల్లెలు. నోట మాట రాకుండా అచేతనంగా చూస్తుండిపోయాడు.

అనితకయితే వెయ్యి వోల్ట్‌ల కరెంట్ షాక్ కొట్టినట్టయింది.

'అన్నయ్యా, కాలేజీలో కొందరు నన్ను రాగింగ్ చేశారు. నువ్వు వారికి గట్టిగా బుద్ధిచెప్పాలి' అని అన్నయ్య దగ్గర కంప్లయింట్ చేయాలని ఆశగా ఎదురుచూసిన అనిత ఏం మాట్లాడాలో కూడా తెలీకుండా శిలగా నిలబడిపోయింది.

— పెరుమండ్ల శ్రీదేవి.